

నారాయణఖేడ్: బారులు తీరిన భక్తులు

భక్తుల సందడి

సంకటహర చతుర్థిని పురస్కరించుకొని జిల్లాలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. ఆయా ఆలయాల్లో అన్నప్రసాద వితరణ చేపట్టారు. సంకటహర చతుర్థికి తోడు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు రెండవ శనివారం సెలవుదినం కావడంతో భక్తుల రద్దీ నెలకొంది.





పటాన్‌చెరు: గణనాథుడికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, ఆలయంతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



న్యాల్‌కల్(జహీరాబాద్): దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం

కాంగ్రెస్ నేత నీలం మధు



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నీలం

పటాన్‌చెరు టౌన్: సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ సమాజమంతా రుణపడి ఉంటుందని కాంగ్రెస్ నేత నీలం మధు అన్నారు. మంత్రివర్గ విస్తరణతో పాటు టీపీసీసీ కమిటీల్లో అన్ని వర్గాలకు ప్రాధాన్యం ఇచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని రేవంత్ రెడ్డిని శనివారం కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాలకు ప్రాధాన్యం కల్పిస్తామని రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను నిలబెడుతూ సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గ విస్తరణతో పాటు టీపీసీసీ కమిటీలో అందరికీ సమ ప్రాధాన్యం కల్పించారని కొనియాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వం విజయదుందుభి మోగించేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ సిబ్బంది



ప్రయాణికురాలికి నగదును అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

సంగారెడ్డి టౌన్: ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ చాటుకున్నారు. వివరాల ప్రకారం శనివారం సంగారెడ్డి ఆర్టీసీ బస్టాండ్‌లో మహారాష్ట్ర సోలాపూర్‌కు చెందిన ఉమారాణి సంగారెడ్డి న్యూ బస్టాండ్ నుంచి మెదక్ డిపో బస్సులో పటాన్‌చెరుకు ప్రయాణిస్తున్నారు. సంగారెడ్డి న్యూ బస్టాండ్‌కు ప్రయాణికురాలు వాష్ రూమ్‌కు వెళ్లి వచ్చేసరికి బస్సు వెళ్లిపోయింది. వెంటనే పటాన్‌చెరు బస్టాండ్ కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహిస్తున్న వ్యక్తికి ఫోన్ చేయగా తిరిగి అదే బస్సులో తన బ్యాగును సంగారెడ్డి న్యూబస్టాండ్‌కు పంపించారు. బ్యాగులో రూ.15000 నగదు ఉన్నట్లు తెలిపారు. కంట్రోలర్ వీరప్ప ఆధ్వర్యంలో ప్రయాణికురాలకు బ్యాగు, డబ్బులు అప్పగించారు. దీంతో ప్రయాణికురాలు ఆర్టీసీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

పటాన్‌చెరు టౌన్: డ్రైనేజీ సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌కు కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను కాలనీవాసులు వివరించారు. అనంతరం కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ అధికారులతో సమీక్షించి త్వరలోనే ఆయా సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

విద్యార్థినికి పీహెచ్‌డీ పట్టా

పటాన్‌చెరు: ఫార్మాస్యూటికల్ పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసిన గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ పరిశోధక విద్యార్థిని రాధికను డాక్టరేట్ వరించింది. సూపర్ సాచురబుల్ సెల్ఫ్–నానో ఎమల్సిఫైయింగ్ డ్రగ్ డెలివరీ సిస్టమ్ ఉపయోగించి బీసీఎస్ క్లాస్–ఐఐ ఔషధాల ద్రావణీయత, జీవలభ్యతను పెంచడంపై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ శనివారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ రాధిక సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించడంపై గీతం అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, పలు విభాగాల అధిపతులు, సిబ్బంది పలువురు అభినందించారు.

సీఎంను కలిసిన అనిల్‌కుమార్

పటాన్‌చెరు: కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన గాలి అనిల్‌కుమార్ శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి ఎల్లవేళలా కృషి చేస్తానని అన్నారు.

ముందస్తు చర్యలెక్కడ?

- చిన్నపాటి వర్షాలకే రోడ్లన్నీ జలమయం
- వర్షాలు పడినప్పుడే నామమాత్రపు చర్యలు



తెల్లాపూర్ రేడియల్ రోడ్డుపై నిలిచిన వర్షం నీరు (ఫైల్)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): దినదిన అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు, రామచంద్రాపురం, అమీన్‌పూర్, తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో చిన్నపాటి వర్షాలకే రోడ్లు, కాలనీలు జలమయంగా మారుతున్నాయి. వర్షాలు పడినప్పుడు మాత్రమే అధికారులు నామమాత్రంగా చర్యలు తీసుకుని చేతులు దులుపుకుంటున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వరద కాలువలు మాయమవుతున్న అధికారులు పట్టించుకోకపోవడంతోనే సమస్య జఠిలంగా మారుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పడుతున్న వర్షాలు పడుతుంటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ముంపునకు గురవుతున్న కాలనీలు

జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో చిన్నపాటి వర్షాలకు అనేక కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. వ్యవసాయ భూములను అభివృద్ధి చేసి ఇళ్ల నిర్మాణ సమయంలో కాలువలను మూసివేయడంతో వర్షం పడినప్పుడు వర్షపు నీరు కాలనీల్లో నిండిపోతున్నాయి. ప్రతి ఏటా ఈ సమస్య వస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ..

తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో వర్షాలు పడినప్పుడు ప్రజలు బయటకు రాలేని దుస్థితి నెలకొంది. మ్యాన్‌హోల్స్ నుంచి వర్షాపు నీటితో పాటు డ్రైనేజీ నీరు రోడ్ల పైకి ఇళ్లలో చేరుతుంది.

జాతీయ రహదారిపైకి వర్షపు నీరు

పటాన్‌చెరు, రామచంద్రాపురం పట్టణంలో వర్షం పడినప్పుడు రోడ్లపై భారీగా నీరు చేరుతోంది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. జాతీయ రహదారిని అనుకుని నిర్మించిన వర్షాపు నీరు వెళ్లే కాలువల్లో వ్యాపార సముదాయాలకు చెందిన డ్రైనేజీ పైపులను కలపడంతో ఈ సమస్యకు కారణమవుతుందని స్థానికులు వాపోతున్నారు. నెల రోజుల క్రితం ఈ సమస్యను హైడా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ స్వయంగా పరిశీలించారు.

మాయమవుతున్న వరద కాలువలు

ఈ ప్రాంతాల్లో భూముల ధరలు కోట్ల రూపాయలు ఉండటంతో రియల్ వ్యాపారులు వరద కాలువలను కూడా వదలడం లేదు. అందులో నిర్మాణాలను చేపడుతున్నారు. దీంతో వర్షాకాలం ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగానే కాలనీల్లోకి, రోడ్లపై నీరు చేరుతుందని స్థానికులు వాపోతున్నారు.

వర్షాకాలంలో తప్పని ఇబ్బందులు

ప్రతి వర్షాకాలంలో ఇబ్బందులు తప్పడం లేదు. రేడియల్ రోడ్డుతో పాటు పలుచోట్ల రోడ్లపై నీరు చేరుతుంది. కొల్లూరు రింగ్‌రోడ్డు ఎగ్జిట్ వద్ద పెద్ద ఎత్తున వర్షాపు నీరు చేరుతుంది. అధికారులు ఇప్పటికైన ముందస్తు చర్యలు తీసుకోవాలి.

– కొల్లూరి శ్రీనివాస్, తెల్లాపూర్

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం..

వర్షాలను దృష్టిలో పెట్టుకొని కాలువల్లో పేరుకుపోయిన మట్టిని తొలగిస్తున్నాం. రోడ్లపై నీరు నిల్వకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. నిత్యం కాలనీల్లో పర్యటిస్తున్నాం.

–జ్యోతి రెడ్డి, కమిషనర్ అమీన్‌పూర్ మున్సిపాలిటీ

నామమాత్రంగా చర్యలు

వర్షాలు కురిసి ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పుడు మాత్రమే అధికారుల అగమేఘల మీద వచ్చి నామమాత్రంగా చర్యలు తీసుకుంటున్నారు. కానీ సమస్యను గుర్తించి శాశ్వత పరిష్కారం మాత్రం చూపటం లేదు. దాని కారణంగా ప్రతి ఏటా ప్రజలు వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నారు.



వర్షం పడటంతో రోడ్డుపై నిలిచిన నీరు, ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఘనంగా బోనాలు ఊరేగింపు



బోనాల ఊరేగింపులో భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట్ మండలం దామర్‌చెరువులో శనివారం గ్రామ దేవతలకు బోనాలు సమర్పించి గ్రామస్తులు మొక్కులు తీర్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ ఆత్మ చైర్మన్ రాంసింగ్, మాజీ జెడ్పీటీసీ నర్సింహరెడ్డి, మాజీ సర్పంచ్ ఈశ్వర్ పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

ఎస్పీ పరితోశ్ పంకజ్



పరేడ్ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

సంగారెడ్డి జోన్: పోలీసు అధికారులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ పరితోశ్ పంకజ్ సూచించారు. జిల్లా ఎస్పీ కార్యాలయం ఆవరణలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ సిబ్బందికి వీక్లీ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో విధులు సమర్థవంతంగా నిర్వహించేందుకు శారీరక దారుఢ్యం చాలా కీలకమన్నారు. శారీరక, మానసిక దృఢత్వానికి ప్రతీరోజు వ్యాయామం, యోగా వంటివి చేయాలని సూచించారు. ఆస్తి సంబంధిత నేరాలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ క్రైమ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్స్ గురించి ప్రజలలో కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నరేందర్, ఆర్‌ఐలు రామారావు, రాజశేఖర్‌రెడ్డి, ప్లటూన్ ఇన్‌చార్జిలు, సిబ్బంది తదితరులున్నారు.

లోక్ అదాలత్‌తో కేసులు పరిష్కారం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి తదితరులు

నారాయణఖేడ్: జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 585 కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ మంథాని మాట్లాడుతూ.. రాజీ మార్గమే రాజా మార్గమని, సామరస్యంతో కేసులు పరిష్కరించుకోవడం మంచిదన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోజిరెడ్డి, సీనియర్ న్యాయవాదులు నర్సారెడ్డి, మారుతిరెడ్డి, నర్సింహారావు, కోర్టు సిబ్బంది, బ్యాంకర్లు పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో..

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 970 కేసులు పరిష్కారమయ్యాయి. సీనియర్ సివిల్ జడ్జి జి.కవితాదేవి, జడ్జి ఎండీ. అబ్దుల్ ఖలీల్ రాజీ మార్గంలో కేసులను పరిష్కరించారు. వీటిలో సీనియర్ కోర్టు విభాగంలో 64 బ్యాంక్ పియల్సి కేసులు, 8 సైబర్ క్రైం, 5 సివిల్ కేసులు పరిష్కారమయ్యాయి. రూ.44,49,714 లక్షలు వసూలయ్యాయి. జూనియర్ సివిల్ కోర్టు విభాగంలో 6 సివిల్ కేసులు, 76 క్రిమినల్ కంపౌండ్, 34 అడ్మిషన్, 828 ఎస్‌టీసీ, 12 అబ్కారీ మొత్తం 970 కేసులు పరిష్కారం కాగా రూ.6,77,850 లక్షలు వచ్చాయి. ఈ సందర్భంగా జడ్జి కవితాదేవి మాట్లాడుతూ.. కేసుల వల్ల అనేక రకాల ఇబ్బందులు ఎదురవుతాయని, రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని చెప్పారు. లోక్‌అదాలత్‌లో డీఎస్పీ సైదా నాయక్, సీఐ శివలింగం, ఎస్‌ఐలు వినయ్‌కుమార్, కాశీనాథ్, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జోగిపేటలో 228 కేసులు

జోగిపేట(అందోల్): జోగిపేట జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జరిగిన నేషనల్ లోక అదాలత్‌లో 228 కేసులు పరిష్కారం అయినట్లు జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా తెలిపారు. వీటిలో భూములకు సంబంధించిన కేసులు 5, బ్యాంకు కేసులు 2, సైబర్ క్రైమ్ కేసులు 2, ఎక్సైజ్ శాఖ కేసులు 4 క్రిమినల్ కేసులు 215 పరిష్కరమయ్యాయని తెలిపారు. సీనియర్ న్యాయవాదులు ఎస్.నారాయణరెడ్డి ఎస్.కృష్ణారెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వాతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రారెడ్డి జోగిపేట సీఐ అనిల్‌కుమార్, జోగిపేట బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీస్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి పథకంతో లబ్ధి

ఎంపీ సురేశ్‌షెట్కార్



చెక్కులు అందజేస్తున్న ఎంపీ షెట్కార్ తదితరులు

జహీరాబాద్: కల్యాణలక్ష్మి–షాదీముబారక్ పథకాలు పేదలు లబ్ధి పొందవచ్చని ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డిలు అన్నారు. శనివారం జహీరాబాద్‌లోని గౌరి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 925 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ప్రభుత్వం రూ.లక్ష సహాయం చేసి ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రామ్ రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి, సీడీసీ చైర్మన్ ముబీన్, ఎంపీ కార్యాలయ ఇన్‌చార్జి శుక్లవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

జహీరాబాద్: మహిళలు ఆర్థికంగా ఎదిగాలని ఎస్‌బీఐ బ్రాంచ్ ఫీల్డ్ ఆఫీసర్ విజయ్‌కుమార్ అన్నారు. శనివారం జహీరాబాద్‌లోని సుభాష్ గంజ్‌లో మైత్రి మహిళా డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు సులభంగా రుణసదుపాయం పొందాలన్నా ఉద్యం సర్టిఫికెట్‌ను పొందాలని సూచించారు. సబ్సిడీలతో పాటు ప్రభుత్వ పథకాలు పొంది ఆర్థికంగా ఎదగాలన్నారు. సంఘం అధ్యక్షురాలు జె.అన్నపూర్ణ మాట్లాడుతూ.. ఉద్యం సర్టిఫికెట్ విశిష్టతను తెలియజేశారు. ఆన్‌లైన్ ద్వారా సర్టిఫికెట్‌ను ఉచితంగా పొందవచ్చన్నారు. సమావేశంలో మహిళా సంఘాల సభ్యులు, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్యాంకు అధికారి విజయ్‌కుమార్

ఆరోగ్య కేంద్రంలో శుభ్రత పనులు



సిబ్బందితో కమిషనర్ మధుసూదన్ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో 100 రోజుల ప్రణాళిక కార్యక్రమాలు కమిషనర్ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఆరోగ్య కేంద్రం పరిసర ప్రాంతాలతో పాటు పలు కాలనీల్లో రోడ్డుపై ఉన్న చెత్తా చెదరాన్ని శుభ్రం చేయించారు. వీధి కుక్కల బెడదను ఎనిమల్స్ బర్త్ కంట్రోల్ సిబ్బంది సమస్యను పరిష్కరించారు. ప్రణాళిక కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆర్వో నర్సింలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్, ఆరోగ్య కేంద్ర, మున్సిపల్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు

జహీరాబాద్ టౌన్: పలువురు లబ్ధిదారులకు శనివారం ఎమ్మెల్యే మాణిక్‌రావు రూ.1.46 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. జహీరాబాద్ మండలంలోని సత్వార్, అనేగుంట, అల్గోల్, చిరాగ్‌పల్లి గ్రామాలకు చెందిన 6 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, పట్టణానికి చెందిన రాజగిరి షీమాకు రూ. 2లక్ష రుపాయల ఎల్‌ఓసీని బీఆర్‌ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, మశ్చేందర్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ గ్రామానికి చెందిన బాధితుడు మోహన్‌కు శనివారం ఎమ్మెల్యే మాణిక్‌రావు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. మోహన్ రోడ్డు ప్రమాదంతో గాయాలపాలై ఆస్పత్రి చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.42,000లను ప్రభుత్వం మంజూరు చేసింది. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు లబ్ధిదారుడికి చెక్కును అందజేశారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

నారాయణఖేడ్: పట్టణంతో పాటు ఖేడ్ మండలంలోని వెంకటాపూర్, సంజీవన్‌రావుపేట్ ఫీడర్ల పరిధిలో ఆదివారం ఉ.10 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని ట్రాన్స్‌కో ఏడీఈ నాగిరెడ్డి, ఏఈ నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాణ్యమైన విద్యుత్తు కోసం చెట్ల కొమ్మలను తొలగించేందుకు సరఫరాను నిలిపేస్తున్నట్లు చెప్పారు.

◆ మిషన్ భగీరథ నీటి సరఫరా బంద్

జహీరాబాద్ టౌన్: మండలంలోని ఉగ్గేల్లి చౌరస్తా వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపడుతున్నందున రెండు రోజులు నీటి సరఫరా బంద్ ఉంటుందని డీఈ నాగేంద్రబాబు శనివారం ప్రకటనలో తెలిపారు. ఉగ్గేల్లి చౌరస్తా వద్ద నిమ్జ్ రోడ్డులో కొత్తగా పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. జహీరాబాద్ మున్సిపల్, మొగుడంపల్లి, జహీరాబాద్ మండలాలతో పాటు ఝరాసంఘం మండలంలోని 10 గ్రామాల్లో ఈనెల 15 వరకు నీటి సరఫరా ఉండదన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

◆ మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని శనివారం కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ అనంతకిషన్ గుప్తాకు సన్మానం



సంగారెడ్డి: టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తోపాజి అనంతకిషన్ గుప్తాను సంగారెడ్డి పట్టణ 12వ వార్డు మాజీ కౌన్సిలర్ పొన్న రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు . పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పొన్న రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. అనంత కిషన్ గుప్తా పార్టీలో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కుమార్, కిష్టారెడ్డి, శైలేష్‌రెడ్డి, వంశీరెడ్డి, ఇంతి యాజ్, సందీప్ ఉన్నారు.

◆ పర్యావరణ పరిరక్షణపై అవగాహన

సంగారెడ్డి టౌన్: పర్యావరణ పరిరక్షణపై హనుమాన్ దేవాలయం నిర్వాహకులు భక్తులకు అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. సంగారెడ్డి బైపాస్ రెవెన్యూ కాలనీ సమీపంలోని అభయాంజనేయ స్వామి దేవస్థానంలో అన్నప్రసాదం వితరణ శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి నెల రెండవ శనివారం అన్నప్రసాదం, పులిహోర ప్రసాదం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్లాస్టిక్ నివారణలో భాగంగా భక్తులకు పేపర్ ప్లేట్‌ల్లో అందజేస్తూ అవగాహన కల్పిస్తున్నారు.

◆ స్వచ్ఛ ఖేడ్‌కు సహకరించండి

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీని స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు పట్టణ వాసులు సహకరించాలని కమిషనర్ జగ్జీవన్ కోరారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా శనివారం ఆక్సిజన్ పార్కులో చెత్తను తొలగించి పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మన్సూర్‌పూర్, నెహ్రూనగర్‌లో రోడ్డుపక్కల, విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద దట్టంగా పెరిగిన పొదలను జేసీబీతో తొలగించారు. 8వ వార్డులో వైద్యశిబిరం నిర్వహించారు. 2, 3, 4వ వార్డుల్లో దోమల నివారణకు ద్రావణం పిచికారీ చేశారు. మున్సిపల్ పరిధిలోని అన్ని తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేశారు. పలువార్డుల్లో మురుగుకాల్వల్లో పేరుకుపోయిన మురుగుతొలగించి యాంటీ లార్వా ద్రావణాన్ని పిచికారీ చేశారు. ఆయా పనులను కమిషనర్ తోపాటు మేనేజర్ వెంకటశివయ్య, శానిటరీ అధికారి శ్రీనివాస్, విద్యుత్ సరఫరా విభాగం ఇన్‌చార్జి అమర్, నీటిసరఫరా విభాగం పర్యవేక్షకులు శ్రావణ్ పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న కిషన్‌సింగ్, తదితరులు

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట్ మండలంలోని విశ్వపాలిని జ్వాలముఖి భవాని సమేత సేవలాల్ మహరాజ్ మహా మందిరంలో శనివారం ఏక వింశతి చండీయాగం ఘనంగా నిర్వహించారు. మందిరం ధర్మకర్త, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ మూడ్ కిషన్‌సింగ్–లలిత దంపతుల ఆధ్వర్యంలో యాగం చేపట్టారు. ప్రముఖ జ్యోతిశ్య వాస్తు శాస్త్ర పండితులు చంద్రమౌళి శర్మ నేతృత్వంలో ప్రత్యేకంగా పూజలు చేశారు. మహారాష్ట్రలోని దెగ్లూర్‌కు చెందిన అంకుశ్ శర్మ, మందిరం పురోహితులు మనోజ్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రలు పఠించారు. హారతి, తీర్థప్రసాదం, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో తండా ప్రముఖులు శంకర్, ఖత్రోత్ జైల్‌సింగ్, రూప్‌సింగ్, కిషన్, రాములు, మన్మోహన్‌సింగ్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో బీజేపీ నాయకులు

జహీరాబాద్: పట్టణ బీజేపీ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు సంతోష్ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా నీలేష్ పాలికర్, కె.నాగేందర్, శివపూజ శ్రీకాంత్, గడ్డం శ్రీధర్, ప్రధాన కార్యదర్శులుగా బొగ్గుల సంతోష్, కె.శోభారాణి, కార్యదర్శులుగా కె.వైష్ణవ్, ప్రీతి జీజా, వడ్డె కృష్ణ, ఎం.బస్వరాజ్, కోశాధికారిగా అప్పం రమేష్‌లను ఎన్నుకున్నట్లు చెప్పారు. సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ జగన్నాథ్, శ్రీనివాస్‌గౌడ్, సుధీర్‌భండారి, బక్కయ్యగుప్తా పాల్గొన్నారు.